ప్రకృతి విపత్తుపై రాజకీయం చేయడం సిగ్గు చేటు

- ప్రజలు ప్రకృతి వైపరీత్యంతో ఇబ్బందులు పడితే బీఆర్ఎస్ వారికి నెల రోజులకు గుర్తొంచిందా?
- పది సంవత్సరాల్లో వడగండ్ల వానతో రైతులు ఇబ్బందులు పడితే కనీసం పట్టించుకున్నారా?
- ఇప్పుడు స్థానిక ఎన్నికలు వస్తుండడంతో ఎమ్మెల్యే హరీష్‌రావు పర్యటన పెట్టుకున్నారు
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మండిపాటు



కామారెడ్డి టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుపై రాజకీయం చేయడం సిగ్గు చేటు అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు పర్యటన నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ప్రకృతి వైపరీత్యంతో ఇబ్బందులు పడితే వారిని పరామర్శించడానికి బీఆర్ఎస్ నేతలకు నెల రోజుల సమయం పట్టిందని విమర్శించారు. ఈ పర్యటన ప్రజల కోసమా.. స్థానిక సంస్థల్లో ఎన్నికల లబ్ధి కోసామా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వడగండ్ల వానలతో ఎన్నోసార్లు పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెబుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చూస్తున్నారని తెలిపారు. కుటుంబ సమస్యలను తేరుకొని బాధితులను పరామర్శించడానికి నెల రోజులు పట్టిందని అన్నారు. నీళ్లలో కొట్టుకపోయి ప్రజలు ఆహాకారాలు చేస్తుంటే ఏ ఒక్క బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్తలు పట్టించుకున్న పాపన పోలేదని అన్నారు. వర్షాల్లో ప్రమాదం అని తెలిసిన సీఎం రేవంత్‌రెడ్డి హెలిక్యాప్టర్‌లో ముంపు ప్రాంతాలను పరిశీలించారని తెలిపారు. రెండు రోజుల తర్వాత రైతులతో, వరద బాధితులతో మాట్లాడి తక్షణ సహాయం కింద రూ.11వేలు అందించారని, అలాగే చనిపోయిన వారికి రూ.4లక్షలు అందించారని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో రివ్యూ నిర్వహించి వారు ఇచ్చిన నివేదికలను కేంద్రానికి పంపించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి సహాయం అందించలేదని తెలిపారు. బీఆర్ఎస్ బయట కేంద్రంపై విమర్శలు చేస్తూ లోపల సహాయం అందిస్తుందని అన్నారు. ఇటీవల ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పరోక్షంగా కేంద్రానికి సహాయం అందించారని తెలిపారు. ప్రజలందరికీ ఈ విషయం తెలిసే గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. స్థానిక ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతవుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు రూ.9వేల కోట్ల రైతుభరోస, రూ.27వేల కోట్ల రైతుల రుణమాఫీ, ఉచిత విద్యుత్, పేదలకు సన్నబియ్యం లాంటి అనేక సంక్షేమ పథకాలను ప్రజలదరికి చేర్చుతుందని తెలిపారు.

టెన్షన్.. టెన్షన్!

- అందరి దృష్టి 8వ తేదీపైనే..
- కోర్టు తీర్పుపైనే ఎన్నికల భవితవ్యం
- రిజర్వేషన్లపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ
- ఊగిసలాటలో ఆశావహులు, నేతలు



5



బరిలో ఎవరు?

- స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై నేతల సమాలోచన
- ఆశావహుల బలాలపై ఆరా
- టికెట్ కోసం ద్వితీయ శ్రేణి నాయకుల ప్రయత్నాలు
- ముగ్గురు పేర్లతో జాబితాను రూపొందించి అధిష్ఠానానికి నివేదించనున్న కాంగ్రెస్
- స్థానికంగానే బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు
- అభ్యర్థుల వేటలో బీజేపీ

కామారెడ్డి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి దింపేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు జరుపుతున్నాయి. అంగ బలం, అర్థ బలం కలిగి ఉండడంతో పాటు ప్రజల్లో మంచి పేరు ఉన్న నాయకులను రంగంలోకి దింపేందుకు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. అధిష్ఠానం సూచన మేరకు కాంగ్రెస్ ముగ్గురు పేర్లను పంపనుంది. స్థానిక నాయకత్వం అభీష్టం మేరకు అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో బీఆర్ఎస్ ఉంది. బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు గెలుపు గుర్రాల కోసం వేట మొదలుపెట్టింది.

అభ్యర్థుల ఎంపికలో ఆచితూచిగా..

స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు కావడం, షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై అన్ని పార్టీల అధిష్ఠానాలు ఆచితూచిగా వ్యవహరిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ద్వితీయ శ్రేణి నాయకత్వం భారీ ఆశలతో ఉంది. అయితే ప్రధాన పార్టీల నుంచి బరిలో నిలిచే ఆయా ఆశావహులు అధిష్ఠానం, ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు దాదాపు ఖరారు కావడంతో పాటు పోటీ చేసే స్థానంలో ఎంచుకుంటూ టికెట్ల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల నుంచి అభ్యర్థులను ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై నేతలు సమాలోచనలు చేస్తున్నారు.

సర్వే ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో ప్రధాన పార్టీలు సర్వే ఆధారంగానే ఎంపిక చేయనున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సర్వే ఆధారంగా అభ్యర్థులను రంగంలోకి దించనున్నారు. మరోవైపు పార్టీ శ్రేణుల అభిప్రాయాలను కూడా స్వీకరించేందుకు సిద్ధమయ్యాయి. ప్రధానంగా జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక విషయంలో పలు ఏజెన్సీలతో సర్వే చేయిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా మెజార్టీ స్థానాలను గెలుచుకునేందుకు ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఇతర పార్టీల్లోని ముఖ్య నాయకులు, అసంతృప్తులకు గాలం వేస్తున్నారు. తమకు టికెట్ దక్కదని అభిప్రాయానికి వచ్చిన పలువురు ఆశావహులు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. ఇదే సమయంలో ఆయా రాజకీయ పార్టీలు సైతం తమ బలాన్ని పెంచుకునేందుకు ఫిరాయింపు రాజకీయాలపై దృష్టి సారించాయి.

ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో..

ఆశావహులు ఒక వైపు టికెట్ల వేట కొనసాగిస్తూనే.. మరోవైపు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అయితే ముందు నుంచి పోటీ చేస్తామని ఓటర్ల మధ్య ఉన్న పలు వురికి రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో తీవ్ర నిరాశలోకి వెళ్లారు. కాగా రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చినవారు ఓటర్లతో అప్పుడే మమేకమవుతున్నారు. ఓటర్లను ఆకర్షించుకునేందుకు థాయిలాలు అందజేస్తున్నారు.

జిల్లాలో భారీ వర్షం

- పలు మండలాల్లో ఉధృతంగా ప్రవహించిన వాగులు, వంకలు
- కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు
- మరోమారు అలుగు దూకిన కామారెడ్డి పెద్ద చెరువు
- పరిశీలించిన కలెక్టర్, అధికారులు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు ఉప్పొంగి ప్రవహించాయి. కామారెడ్డి నియోజకవర్గంలోని కామారెడ్డి, దోమకొండ, రాజంపేట, మాచారెడ్డి, పాల్వంచ తదితర మండలాలతో పాటు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నాగిరెడ్డిపేట, సదాశివనగర్, తాడ్వాయి, ఎల్లారెడ్డి, లింగంపేట తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పెద్దచెరువు మరోమారు ఉధృతంగా ప్రవహిస్తూ అలుగు దూకింది. దీంతో వరద నీరు ప్రధాన కాలువగుండా ప్రవహించడంతో జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీల ప్రజలను అధికారులు అప్రమత్తంగా చేశారు. కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ వరద ఉధృతిని పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు జాగ్రతలు, సూచనలు తెలియజేయాలని ఆదేశించారు. కాగా ఈ వరదలతో రైతులకు మరోమారు తీవ్ర నష్టం చేకూరిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఆందోళనకు గురి చేసిన వర్షం



దోమకొండలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఇప్పటికే గత నెలన్నర కింద వచ్చిన వరదలతో కొట్టుకపోయిందని ఆందోళన చెందుతున్న రైతులకు ఆదివారం కురిసిన వర్షం మళ్లీ కన్నీళ్లను తీసుకువచ్చేలా చేసింది. కామారెడ్డి మండలంతో పాటు ఆయా మండలాల్లో వరి సాగు కొన్ని చోట్ల పొట్ట దశకు రాగా, మరికొన్ని చోట్ల కోతలకు వచ్చింది. పంట కొనుగోలు చేపట్టేందుకు అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రధాన కాల్వల వెంట పంట పొలాల్లో వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రైతులు పంటను విడిచి పెట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే విధంగా దోమకొండ, రాజంపేట, రామారెడ్డి, మాచారెడ్డి మండలాల్లో పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో కోతలు మరింత అలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ సూచించారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వరద కాలువను అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లాలో ఇటీవల అధిక వర్షాల వల్ల ఏర్పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరించి ముంపునకు గురయ్యే ప్రాంతాలు, ఓవర్‌ఫ్లో అయ్యే ప్రాజెక్టులు, చెరువులు, కుంటలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. పాత ఇళ్లు, భవనాలు, ప్రమాదకరంగా ఉన్న వాటిని గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అత్యవసరం అయితే తప్ప బయటకు రాకూడదని తెలిపారు. చేపలు పట్టుటకు, పశువులు, గొర్రెలను నీటి వనరుల వద్దకు తీసుకెళ్లరాదని తెలిపారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే టోల్ ఫ్రీ నెంబర్ 08468-220069కు సమాచారం అందించాలని సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్



ఐదు గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల



నిండుకుండలా నిజాంసాగర్ ప్రాజెక్టు

శాంతించిన మంజీరా నది

- 19,083 క్యూసెక్కుల వరద రాక
- 10 గేట్లు మూసివేత.. ఐదు గేట్ల ద్వారా నీటి విడుదల

నిజాంసాగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): 47 రోజులుగా ఉధృతంగా ప్రవహించిన మంజీరా నది ఒకేసారిగా శాంతించింది. శని, ఆదివారాల్లో మంజీరా నది వెంట వరద నీటి ఉధృతి తగ్గిపోయింది. స్వల్పంగా నిజాంసాగర్‌లోనికి వచ్చే వరద నీటిని వీఆర్ నెంబర్ ఐదులోని గేట్లు ఎత్తి మంజీరా దిగువకు 19 వేల 083 క్యూసెక్కుల వరద నీటిని మంజీరా దిగువకు విడుదల చేస్తూనే ఉన్నారు. 47 రోజులుగా నిరాటంకంగా కొనసాగిన వరద గేట్లలోని పది గేట్లను మూసివేశారు. ఐదు గేట్లు కొనసాగిస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1405 అడుగుల నీటి మట్టాన్ని పూర్తిగా నిల్వ ఉంచుతున్నారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 17.802 టీఎంసీల సామర్థ్యానికి గాను 17.658 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని ఉంచుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు వీఆర్ నెంబర్ -4లోని 20 వరద గేట్లను మూసివేయంతో పరిసరాల ప్రాంతాలు నిర్మానుశ్యంగా మారాయి. ఆదివారం సెలవు కావడంతో ప్రభుత్వ పర్యాటకుల సందడి నెలకొంది.



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

సమష్టి కృషితో అభివృద్ధికి పాటుపడాలి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

రామారెడ్డి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పాల్గొని సమిష్టి కృషితో అభివృద్ధికి పాటు పడాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి బేధాలు లేకుండా పార్టీ అభ్యర్థులను త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గెలిపించుకోవాలని పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. కాంగ్రెస్ మండల పార్టీ సలహాదారు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రామారెడ్డి టౌన్ అధ్యక్షుడు నామాల రవీందర్ కలిసి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. రాబోయే స్థానిక ఎన్నికలకు పూర్తి స్థాయి నా వంతు కృషి తెస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి మండల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొగుళ్ల ప్రవీణ్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ ఎండి. రావుఫ్, నాయకులు లక్కాకుల శేఖర్, కిసాన్ యాదవ్, బండి ప్రవీణ్, ల్యాగల ప్రసాద్, లింబాద్రి, ఇసాయిపేట్ హరీష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటించినా.. నయా పైస అందని సహాయం

- పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25వేలు తక్షణ సహాయం చేయాలి
- ఇళ్లు కూలిపోయిన బాధితులకు లక్షా 10 వేలు ఆర్థిక సహాయం అందించాలి
- కొత్త ఇళ్లు మంజూరు చేయాలి
- మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్

నాగిరెడ్డిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భారీ వరదల కారణంగా కామారెడ్డి జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, వందలాది ఇళ్లు కూలిపోయాయని, జిల్లాలో తీవ్ర ఆస్తి నష్టం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయానా జిల్లాలో పర్యటించి బాధితులందరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారని, ముఖ్యమంత్రి పర్యటించి వెళ్లి నెల రోజులు గడిచినా ఇంత వరకు నయా పైస సహాయం అందించలేదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ఆదివారం నాగిరెడ్డిపేట మండల కేంద్రం సమీపంలో బంజారా గ్రామం వద్ద మంజీరా నది వరదలతో ముంపునకు గురై నష్టపోయిన వరి పంటలను హరీష్‌రావు పరిశీలించారు. మండలంలో మంజీరా వరదతో పంటలు ముంపునకు గురై పంటలు నష్టపోయిన రైతులతో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా, వరదల కారణంగా, తీవ్రంగా నష్టం వాటిల్లడంతో జిల్లాలో జరిగిన నష్టాన్ని అధికారులు సర్వేలు నిర్వహించి, జిల్లాలో 344 కోట్ల రూపాయల నష్టం జరిగిందని ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తే ఇప్పటి వరకు 34 రూపాయలు జిల్లాకు విడుదల కాలేదని ఆయన విమర్శించారు. సీఎం జిల్లాకు వచ్చిన సందర్భంలో 15 రోజుల్లో అధికారులతో హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహిస్తామని యుద్ధ ప్రాతిపదికన పనులు జరిగేలా చూస్తామని చెప్పి నెల రోజులైనా ముఖ్యమంత్రి రివ్యూ చేసింది లేదన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సైతం జిల్లా వైపు కన్నెత్తి చూడడం లేదని ఆయన ఆరోపించారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో రోడ్లు తెగిపోయి, కాలువలకు గండ్లు పడి, చెరువులు తెగిపోయాయి. కానీ ఏ ఒక్కచోట కూడా పునరుద్ధరణ పనులు ప్రారంభించలేదని ఆయన అన్నారు. కామారెడ్డి - ఎల్లారెడ్డి రహదారిపై మధ్యన గల బ్రిడ్జి తెగిపోయిందని, దీనిని ముఖ్యమంత్రి సైతం కూలిపోయిన బ్రిడ్జిని చూసి వెళ్లారని, వెంటనే మరమ్మతు పనులు జరుపుతామని చెప్పి నెల రోజులైనా ఇప్పటి వరకు పనులు జరగలేదని, దీంతో ఎల్లారెడ్డి - కామారెడ్డి రహదారుల్లో ఆర్టీసీ బస్సులు నడవడం లేదని, దీంతో రవాణా సౌకర్యం పూర్తిగా స్తంభించిందన్నారు. బ్రిడ్జిలకు మరమ్మ తులు చేసింది లేదు, రైతులకు పైస సహాయం చేసింది లేదు. ఇళ్లు కూలిపోయిన ప్రజలకు ఒక రూపాయి ఇచ్చిన పాపనా పోలేదని, రేవంత్‌రెడ్డి మాటలకు ఎక్కువ చేతలకు తక్కువ అని ఆయన విమర్శించారు. కామారెడ్డి జిల్లాలో దాదాపు 40వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, వేలాది ఎకరాల్లో ఇసుక మేటలు పెట్టాయని, వందల ఇళ్లు కూలిపోయాయన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు 10 వేల రూపాయలు తక్షణమే ఆర్థిక (మిగతా 6వ పేజీలో)



నాగిరెడ్డిపేటలో మహిళా రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

క్రైం సమాచారం

వివాహిత ఆత్మహత్య


భాగ్యలక్ష్మి (ఫైల్)

లింగంపేట, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐలాపూర్‌కు చెందిన కొట్టంల భాగ్యలక్ష్మి(20) ఆదివారం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. భాగ్యలక్ష్మి కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతుందని, దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలియజేశారు. మృతురాలికి ఏడాదిన్నర కూతురు భవ్యశ్రీ ఉన్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

భిక్కనూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): : మండలంలోని జంగంపల్లి శివారులో ఆర్‌టీఏ చెక్ పాయింట్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కామారెడ్డి వైపు నుంచి జంగంపల్లికి బైక్‌పై వెళ్తున్న మనోహర్, నిశాంత్‌తో పాటు లక్ష్మీనగర్‌తాండా వద్ద సీతాఫలాలు విక్రయిస్తున్న బానోత్ శంక్(55)ను అదేవైపు వెళ్తున్న కారు అతివేగంతో ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకర్‌కు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందగా.. నిశాంత్, మనోహార్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు గాయపడిన వారిని వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో బీజేపీ నేత మృతి


శ్రీనివాస్(ఫైల్)

రామారెడ్డి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పల్వాయికి చెందిన బీజేపీ నేత కాల శ్రీనివాస్ గుండెపోటుతో మృతిచెందారు బీజేపీలో పార్టీలో మండల, జిల్లాస్థాయి నాయకత్వంలో మంచిగా పనిచేశారు. శ్రీనివాస్ మృతికి తీరని లోటని మాజీ మండలాధ్యక్షుడు భూమాగౌడ్ విచారం వ్యక్తం చేశారు. కాల శ్రీనివాస్ అంత్యక్రియల్లో కామారెడ్డి జిల్లా బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేపలవేటకు వెళ్లి యువకుడి గల్లంతు

మెండోర, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ముందు చేపలు పట్టడానికి వెళ్లి అనిల్ నీటిలో గల్లంతయ్యాడని ఎస్సై సుహాసిని తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. శనివారం దిలాల్‌పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన ఆనంద్, అనిల్ సోదరులు చేపలు పట్టడానికి ప్రాజెక్టు వరద గేట్ల ముందుకు వెళ్లారు. గేట్ల ద్వారా నీటి ప్రవాహం పెరగడంతో ఆనంద్ ప్రాణాలతో బయటపడ్డాడు. అనిల్ నీటిలో గల్లంతయ్యాడు. అతడి కోసం గోదావరిలో గాలించినా ఆచూకీ దొరకడలేదని, గల్లంతయిన వ్యక్తి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి అదృశ్యం

బోధన్,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాకాసిపేటలో గల వృద్ధాశ్రమం నుంచి శెట్‌పల్లి లత అనే వృద్ధురాలు శనివారం సాయంత్రం అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. నవీపేట మండలం అభంగపట్నం గ్రామానికి చెందిన వృద్ధురాలు లత మతిస్థిమితం లేక బోధన్‌లో తిరుగడంతో పోలీసులు సదరం హోమ్‌లో ఆశ్రయం కల్పించారని తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి ఆమె కనిపించకపోవడంతో సదరం నిర్వాహకులు పోలీసులకు తెలుపగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు. సీసీ ఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ జరిపి అదృశ్యమైన వృద్ధురాలిని పట్టుకుంటామని సీఐ తెలిపారు.

అడుగడుగునా గుంతలు


గాంధీనగర్ - నాగాపూర్ మార్గంలో ఏర్పడిన గుంతలు


కమ్మర్‌పల్లి మండలంలో ఇలా..


రోడ్డుప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు(ఫైల్)

కమ్మర్‌పల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, జగిత్యాల జిల్లాల సరిహద్దులోని కమ్మర్‌పల్లి 63వ నంబరు జాతీయ రహదారిపై అడుగడుగున అడుగులోతు గుంతలు ఏర్పడి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణాలు సాగించే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో అప్పటి రోడ్డుభవనాల శాఖమంత్రివేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రీబీటింగ్ పనులు చేయించారు. అయితే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చిన్నచిన్న గుంతలు కాస్త అడుగులోతుగా మారాయి. మోర్తాడ్ మండల సరిహద్దు నుంచి కమ్మర్‌పల్లి మీదుగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం సరిహద్దు గండి హనుమాన్ వరకు కేవలం 4 కిలోమీటర్ల పొడువు జాతీయ రహదారి 63 పరిధిలోకి వస్తుంది. ఈ పరిధిలో వందల సంఖ్యలో గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు గుంతలను తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టడం లేదా.. అదుపు తప్పి ప్రమాదాలకు లోనవ్వడం పరిపాటిగా మారింది. 4రోజుల క్రితం గుంతలను తప్పించబోయి ఎదురుగా వస్తున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తితీవ్రగాయలతో బయటపడగా కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

ఎడపల్లిలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఎడపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ షిర్డీసాయి బాబా అలయ 15వ వార్షికోత్సవాలు 3రోజులపాటు ఘనంగా నిర్వహించారు. వేడుకలలో చివరి రోజైన ఆదివారం ఆలయంలో భక్తులు ఉదయం నుంచి సాయి నామస్మరణ, సాయి సచ్చరిత పారాయణం చేస్తూ భజనలు చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ప్రతీఒక్కరు భక్తిభావన కలిగి ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామంలో సాయిబాబా అలయాన్ని స్థాపించి ప్రతి గురువారం భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వర శర్మను ఆయన అభినందించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సాయిబాబా చిత్రపటాన్ని గ్రామ పురవీధుల గుండా భక్తులు ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వరశర్మ, కంజర్ సవిత, కంజర్ రామకృష్ణ, శ్రీలత, భక్తులు ఉన్నారు.


వేడుకల్లో పాల్గొన్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాల ప్రారంభం


కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ ప్రత్యేక అధికారి అశోక్

రెంజల్,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ప్రత్యేక అధికారి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం రెంజల్ ప్రాథమిక సహకార సంఘంతో పాటు నీలా, సాటాపూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఇంద్రసేన్, సిబ్బంది కిషోర్, శ్రీనివాస్, సాయిబాబా పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు


మోతేలో ఎల్లమ్మకు బోనాలు తీస్తున్న భక్తులు

వేల్పూర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతెలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా ఆదివారం ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ ఉత్సవాలలో భాగంగా సోమవారం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అమ్మవారికి ప్రాణప్రతిష్ఠ, శాంతికళ్యాణం, మహాపూర్ణహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గౌడ సంఘ సభ్యులు తెలిపారు. ఈనెల 7 వరకు గ్రామంలోని బ్యాంక్ వద్ద ఎల్లమ్మ ఒగ్గు కథ ఉంటుందన్నారు. ప్రతీరోజు బైండ్ల పోతరాజుల ఆటపాటల విన్యాసాలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు.

సిద్ధులగుట్టపై మాస్క్, స్కార్ఫ్ నిషేధం



మాస్క్‌లు, స్కార్ఫ్‌లు ధరించి రాకూడదని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పెర్కిట్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని పవిత్ర పుణ్యక్షేత్రం నవనాథ సిద్ధుల గుట్టపైకి యువతీ, యువకులు మాస్క్, స్కార్ఫ్ ధరించి వెళ్లడాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు నిషేధించారు. ఇటీవల గుట్టపైకి వెళ్లే దారిలో ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. సిద్ధుల గుట్టపైకి కొంతమంది యువతీయువకులు మాస్కులు, స్కార్ఫ్‌లు ధరించి వెళ్లి అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారని, వాటికి అడ్డుకట్ట వేయడానికి మాస్కుగాని, స్కార్ఫ్‌గాని ధరించి వస్తే ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమని పేర్కొన్నారు. ఎవరైనా గుట్టపైకి వచ్చి మళ్లీ మాస్కులు గాని, స్కార్ఫ్‌లు గాని ధరిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. ఆర్మూర్ పట్టణ, పరిసర గ్రామాల నుంచి దూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు గుట్టపైకి వచ్చి సిద్దేశ్వరున్ని దర్శనం చేసుకుంటారు. ఇలాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో ఏవిధమైన అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ఏర్పాటు చేసిన నిబంధనలను భక్తులందరూ పాటించాలని సూచించారు.

మొక్కజొన్నలకు మద్దతు ధర ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు నాయకుడు జైడి గంగారెడ్డి

జక్రాన్‌పల్లి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటుచేయాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జక్రాన్‌పల్లిలో రైతు నాయకుడు జైడి గంగారెడ్డి రైతులతో కలిసి మాట్లాడారు. మొక్కజొన్న పంట చేతుకు వచ్చి కల్లాలలో, రోడ్ల పక్కన ఆరబెడుతున్నప్పటికి కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న పంట దెబ్బతిందని దీంతో రైతులు పంట నష్టపోయారన్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని రైతులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతులు నరెడ్ల చిన్నసాయిరెడ్డి, నికిల్‌రెడ్డి, జైడి చిన్నోళ్ల గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో స్వచ్ఛ భారత్


శ్రమదానం చేస్తున్న మహాత్మా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఆర్మూర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫైర్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్ ఆవరణలో, వెనకభాగంలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్, గణేష్, రాజ్‌కుమార్, ప్రశాంత్, నిశాంత్, మ ధుసూదన్, నరేందర్,ఎల్లయ్య, ఆదిత్య, కృషివర్ధన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి


బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గంగారెడ్డి

బోధన్,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గిర్దావర్ గంగారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆచన్‌పల్లి శివారులో బీఆర్‌ఎస్ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను నాయకులు, కార్యకర్తలు అషామాషిగా తీసుకోవద్దని, కష్టపడి పని చేస్తేనే లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని చేసి ధైర్యంగా ముందుకెళ్లి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కాంగ్రెస్‌ని గెలిపించి తప్పు చేశామని బాధ పడుతున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి కార్యకర్తలు సిద్దంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధర్మయ్యగారి సంజీవ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, నాయకులు రవి కిరణ్, నర్సయ్య, ఖలీల్, పీరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలను కైవసం చేసుకుందాం



బీజేపీలో చేరుతున్న సాలూర వాసులు

బోధన్,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ కన్వీనర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సాలూరకు చెందిన లింబూరి లక్ష్మణ్‌తో పాటు యువకులు అధిక సంఖ్యలో పార్టీలో చేరగా వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు ఆసక్తిగా ఉన్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను కార్యకర్తలు సమష్టి కృషితో గెలిపించాలన్నారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు పర్చడంలో విఫలమైందన్నారు. ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. బీజేపీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో బీజేపీ కార్యకర్తలు పోటీలో ఉంటారన్నారు. అన్ని స్థానాలు కైవసం చేసుకునేలా పక్కా ప్రణాళికతో కార్యకర్తలు ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రావుబా గంగాధర్, ప్రధాన కార్యదర్శి దిలీప్, సుభాష్, సీనియర్ నాయకులు గోనె ప్రవీణ్, ముత్యం ప్రకాష్, మాధవరావు పటేల్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ కాలనీలో కష్టాలు


భారీ గుంతలు పడి గుంతలలో నీరు నిలిచిన దృశ్యం

జక్రాన్‌పల్లి,అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లిలోని జాతీయ రహదారి బ్రిడ్జి నుంచి ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలకు వెళ్లే వైఎస్‌ఆర్ కాలనీలో సమస్యల నిలయంగా మారింది. కాలనీలో ఏర్పడి ఏళ్లు గడుస్తున్నప్పటికీ సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీ నుంచి ఆదర్శ, కస్తూర్బా గాంధీ పాఠశాలకు చదువుకోవడానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి విద్యార్థులు వెళ్తారు. భారీ వర్షాలకు కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై భారీ గుంతలు పడి నీరు నిలిచిపోయింది. ప్రతీరోజు పాఠశాలల వైపు విద్యార్థులు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై వెళ్తుంటారు. దీంతో ఈ దారిలో నరకయాతన అనుభవిస్తున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని, పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ఇటీవల కాలనీవాసులు ఎంపీడీవో సతీష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులకు వినతిపత్రం అందజేసి నెల గడుస్తున్నా కాలనీలో సమస్యలను పరిష్కరించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తమ అవస్థలు తీర్చాలని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


సాలురలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ సీఈవో శివరామకృష్ణ

సాలూర,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాడిజమాల్‌పూర్ పీఏసీఎస్ సీఈవో డీ.శివరామకృష్ణ అన్నారు. ఆదివారం సాలూర మండలంలోని జాడి సిసైటీ ఆవరణలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం రైతులకు మంచి గిట్టుబాటు ధరను అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన రైతులకు సూచించారు. చివరి గింజ వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ ధాన్యాన్ని రైతులు విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. సిబ్బందికి సహకరిస్తూ ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తెచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● **పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

బోధన్: మండలంలోని ఎరాజ్‌పల్లి, మినార్‌పల్లి, అమ్దాపూర్, ఊట్‌పల్లి సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సీఈవోలు కోరారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

నవీపేట,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘుపతిరెడ్డి గార్డెన్స్‌లో సోమవారం మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షులు భగవాన్‌లు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరుకానున్నారని వారు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి సకాలంలో హజర్రై, విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


బినోలలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవీపేట,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12వ తేదీలలో జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బీఎల్‌టీయూ) 2వ రాష్ట్ర మహసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు ఎస్. సిద్ది రాములు కోరారు. ఆదివారం మండలంలోని బినోలలో రాష్ట్ర మహసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బీడీ కార్మికులకు నెలకు 4016రూపాయల జీవన భృతిని చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గంగాధర్, కిషన్, కళావతి, మమత, వర్షిత, నవనీత పాల్గొన్నారు.

డీపీవో ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం


కోస్లీలో వినోద్‌ను సన్మానిస్తున్న యువకులు

నవీపేట,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీలో ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాలలో డీపీవో ఉద్యోగం సాధించిన వినోద్‌ను ఆదివారం స్థానికులు ఘనంగా సన్మానించారు. రెంజల్‌లో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వినోద్ ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాలలో ఉత్తీర్ణత సాధించి డీపీవో ఉద్యోగం సాధించారు. ఈ మేరకు వినోద్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. వినోద్ లాంటి వారు యువతకు ఆదర్శమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ హరీష్ కుమార్, సాయన్న, మోహన్, రాము, అశోక్, బాలరాజు, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనాలు.. ఆత్మీయ పలకరింపులు


అంకాపూర్‌లో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆర్మూర్ , అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-8 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులు వింజామర వెంకట్ నర్సయ్య, పసుపుల సుదర్శన్, దొండి శ్యామల, శారద, అతిక్‌లను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు నాటి తమ అనుభవాలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకట్, వీరేందర్, జ్ఞానేశ్వర్, ఆశీర్వాదం, కృష్ణయ్య, సతీష్, జలీల్, సర్దాం, అశ్విని, రేణుక, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.


పెర్కిట్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆర్మూర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని ఓ గార్డెన్‌లో ఆదివారం పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996-97 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నా రు.ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సురేందర్, ఓబన్న, చక్రధర్, మెగులయ్యను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సునీల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్, హన్మాండ్లు, సాయికుమార్‌గౌడ్, వినోద, సుజాత, సురేఖ, రమాదేవి, లలిత పాల్గొన్నారు.

టెన్షన్.. టెన్షన్..!



- అందరి దృష్టి 8వ తేదీపైనే
- కోర్టు తీర్పుపైనే ఎన్నికల భవితవ్యం
- రిజర్వేషన్లపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ
- ఊగిసలాటలో ఆశావహులు, నేతలు
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు
- ఎక్కడ చూసినా ఎన్నికల ముచ్చట్లే

ఎల్లారెడ్డి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు జీవోపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఏం తీర్పు ఇస్తుందోనని రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠగా మారింది. జీవో-9 అమలుకు అనుమతిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా ప్రకటన చేస్తుందా? లేక నిలిపివేస్తూ ప్రకటన వస్తుందా? అసలు అక్టోబరు 8న ఏం జరుగుతుందని ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ కొనసాగుతుంది.

ఎన్నికలు జరుగుతాయా..? వాయిదానా..?

బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో9ని జారీ చేసిన విషయం తెలిసిందే. ఒకవేళ ఈ జీవోపై స్టే ఇస్తే ప్రకటించిన ప్రకారం ఎన్నికలు జరుగుతాయా? లేక వాయిదా వేస్తారా? అనేది హాట్ టాపిక్‌గా మారింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు గత నెల 29వ తేదిన రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో 2001 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ప్రాదేశిక స్థానాలు, పంచాయితీలను కేటాయించగా, జీవో -9 ప్రకారం బీసీలకు 42 శాతం మేర పంచాయితీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను రిజర్వు చేశారు. జనరల్ స్థానాలతో పాటు మహిళలకు రిజర్వేషన్ చేసిన స్థానాలను ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేశారు.

● తరువాత చూద్దామన్నా... తప్పని ఖర్చులు

రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వచ్చిన ప్రాంతాల్లో ఆశావాహులు కొందరు ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నాహాలు ప్రారంభించగా, మరికొందరు వేచి చూసే ధోరణితో ఉన్నారు. జీవోకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు వస్తే రిజర్వేషన్లు మారే అవకాశం ఉందని, తీర్పు వచ్చిన తర్వాతనే ముందుకు సాగే విషయం తేల్చుకుందామని పలువురు భావిస్తున్నారు. మందు, విందు కోసం బాగానే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆచితూచి వ్యవహరిస్తున్న వారు కూడా ఎంతో కొంత ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అక్టోబర్ 8 తర్వాత చూసుకుందాం అంటూ ఖర్చు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసిన ఆశావాహులు ఖర్చు బారిన పడక తప్పని పరిస్థితులు ఎదురయ్యాయి.

● గతానికి భిన్నంగా..

గతంలో ముందుగా ఒక నోటిఫికేషన్ జారీ అయ్యేది. అయితే ఎంపీటీసీ ఎన్నికలు లేదా సర్పంచ్, వార్డు ఎన్నికల్లో ఏదో ఒకటి ముందు జరిగేవి. దీంతో ముందుగా వచ్చిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆ ఎన్నికల్లో నుంచి ఓట్లు సాధించి దరిదాపుల్లోకి వచ్చి ఓడిపోయిన వారు. మరోసారి వెంటనే వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే అవకాశం ఉండేది. కానీ ఈసారి సానుభూతికి అవకాశం లేకుండానే నేరుగా ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఆ వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫలితంగా ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు సానుభూతిని మూటగట్టుకునే ఛాన్స్ లేకుండా పోయింది. ఒకవేళ రెండింటికి పోటీ చేస్తే నెగిటివ్ ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. మొదటి ఎన్నికల్లో ఓడి.. రెండో ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఈసారి లేవు. గతంలో చాలామంది సర్పంచ్‌గా ఓడి, ఎంపీటీసీ ఎన్నికల్లో గెలిచారు. ఎంపీటీసీగా ఓడి, సర్పంచ్‌గా గెలిచారు. ఈసారి ఆ అవకాశం లేకుండా పోయింది ఏది ఏమైనా ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలు రసవత్తంగా సాగనున్నాయి.



రావుట్లలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ప్రజా సమస్యలే ఎజెండాగా ఎన్నికల్లో పాల్గొందాం

● మాస్‌లైన్ నిజామాబాద్-కామారెడ్డి జిల్లాల కార్యదర్శి ప్రభాకర్

సిరికొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలే ఎజెండాగా ఎన్నికల్లో పాల్గొందామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నిజామాబాద్- కామారెడ్డి సంయుక్త జిల్లాల కార్యదర్శి వి.ప్రభాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిరికొండ మండలం రావుట్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్థానిక సంస్థల ఎన్నికలు- పార్టీ వైఖరి అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఎన్నికలు విప్లవ పార్టీలకు ఒక ఎత్తుగడ మాత్రమే అని అన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలే ఎజెండాగా మార్చుకొని ఎన్నికల్లో పాల్గొందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజా సమస్యలను గుర్తుచేస్తూ ఎన్నికలను ఎత్తుగడగా ఉపయోగించుకోవాలన్నారు. సీపీఐ,' సీపీఎం పార్టీలు భూర్జువ పార్టీలతో ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని దిగజారుడు రాజకీయాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. వారిని వీరిని రివిజనిస్టు పార్టీలుగా ప్రకటించి ఎంఎల్ పార్టీగా వేరుపడ్డామన్నారు. ఓట్లు, సీట్లు గీటురాయిగా రివిజనిస్టులు పనిచేస్తారని ఆయన కార్యకర్తలకు వివరించారు. విప్లవ పార్టీలుగా వాటిని భూర్జువ పార్టీలుగా తిరస్కరించాలని ప్రజలకు పిలుపునివ్వాలని ఆయన కోరారు. విప్లవ పార్టీలు పోటీలో ఉన్న చోట కలిసి అవగామనతో ముందుకు పోవాలని ప్రభాకర్ కార్యకర్తలను కోరారు.కాంగ్రెస్,బిజెపి,బీఆర్ఎస్ పార్టీలు డబ్బు సంచులు,మద్యం తో ఎన్నికల్లో తలపడుతాయని,ప్రజలు భూర్జువ పార్టీలను చిత్తు చేసి ప్రజల కోసం పనిచేసే సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రభాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రామకృష్ణ,జిల్లా నాయకులు దేవరాం, ముత్తెన్న రమేష్, సురేష్, సత్తెవ్వ, రాజేశ్వర్, కిషన్, దామోదర్ నారగౌడ్, ఈ రమేష్, నరేందర్, పద్మా, భూముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నవోదయకు ఎంపికైన విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న నర్సయ్య

నవోదయకు సిరికొండ విద్యార్థి

సిరికొండ, అక్టోబరు 5 (ఆంధ్ర జ్యోతి): జవహర్ నవోదయ పాఠశాలకు సిరికొండ విద్యార్థి గొల్ల రిశ్వంత్ ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.నర్సయ్య తెలిపారు.2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరడానికి రిశ్వంత్ ఎంపిక కావడం ఆనందంగా ఉందని నర్సయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థికి జ్ఞాపికను అందజేశారు. ఈ ఏడాది జనవరిలో ప్రవేశ పరీక్షను నిర్వహించారని ఆయన తెలిపారు. నిజామాబాద్‌లో ఏర్పాటు చేసే పాఠశాలలో రిశ్వంత్ చేరుతారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు నవీన్, చామంతి పాల్గొన్నారు.



బీర్కూర్‌లో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవంలో మాట్లాడుతున్న సాయిలు

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

బీర్కూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ సంస్థ ఏర్పాటై వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా సంస్థ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అయితే బీర్కూర్ మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ బీర్కూర్ శాఖ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాక్లేవార్ గంగాధర్ రావు, వక్తగా కామారెడ్డి జిల్లా సహకార్యవాహ శ్రీరెడ్డి సాయిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. 1925లో డాక్టర్ బలిరామ్ కేశవ హెగ్డేవార్ దేశ నిర్మాణం కోసం ఆర్ఎస్ఎస్ సంస్థను స్థాపించారని తెలిపారు. 1925 నుంచి 2025 వరకు వందేళ్లుగా ఆర్ఎస్ఎస్ ప్రస్థానం కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా పంచ పరివర్తన అనే అంశంపై వారు మాట్లాడారు. కుటుంబ బోధ, సామాజిక సమరత ,పర్యావరణం, స్వదేశీ, పౌర కర్తవ్యం అనే అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు, గ్రామ యువకులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

మద్నూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయానికి కృషి చేయాలని మద్నూర్ మండల స్థానిక ఎన్నికల ఇంచార్జి మోటూరి శ్రీకాంత్ అన్నారు. స్థానిక ఎన్నికల సమావేశాన్ని మద్నూర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యకర్తల కృషి వల్లనే బీజేపీ అధికారంలోకి వస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జుక్కల్ మాజీ శాసన సభ్యురాలు కుమారి అరుణతార, మండల అధ్యక్షుడు తెప్పావర్ తుకారాం, నాయకులు కృష్ణ పటేల్, తులవార్ సంతోష్, డోంగ్లి మండల అధ్యక్షులు అరుణ్ పటేల్, మాజీ సింగిల్ విండో చైర్మన్ పండిత్ రావ్ పటేల్, శంకర్ పటేల్, ప్రవీణ్, హన్మండ్లు, జూబ్రె సుధాకర్, అజయ్ తమ్మేవార్, యాదవ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్థానిక ఎన్నికల ఇన్‌చార్జి



ద్విచక్ర వాహనం అందజేస్తున్న మండప నిర్వాహకులు

విజేతకు బైక్ అందజేత

బోధన్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని తట్టికోటలో గల శ్రీ మార్కండేయ దేవీ అమ్మవారి విగ్రహ 11వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహణ కమిటీ లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కీ డ్రాలో గెలుపొందిన కోటగిరి మండలానికి చెందిన మోతిరాం రవి కిరణ్‌కు పట్టణ సీఐ వెంకట నారాయణ చేతుల మీదుగా బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనాన్ని ఆదివారం అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో తనకు లక్కీ డ్రా వాహనం వచ్చిందని ఈ సందర్భంగా అమ్మవారి కమిటీ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినోద్, పవన్ కుమార్, కమిటీ నిర్వాహకులు తదితరులున్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘు నాయకులు

ఆర్య వైశ్యుల అభివృద్ధికి పాటుపడాలి

సుభాష్‌నగర్ అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా అందరూ కలిసికట్టుగా పని చేసి ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటుపడాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని కిసాన్ గంజ్‌లో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దసరా పండగ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త మాట్లాడుతూ నేటి తరం ఆర్య వైశ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్క దేవేందర్ గుప్తాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పార్టీల కతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ముందుండి సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్క దేవేందర్ గుప్తా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ధన్‌పాల్ శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

బాసరలో పెరిగిన కుక్కల బెడద

● అధికారుల నిర్లక్ష్యంపై భక్తులు, స్థానికుల ఆగ్రహం



బాసర అమ్మవారి ఆలయం సమీపంలో వీధి కుక్కల స్వైర విహారం



గాయపడిన బాలుడు

బాసర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాసర పుణ్యక్షేత్రంలో పిచ్చి కుక్కల స్వైర విహారం స్థానికులు, బక్తులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అధికాథుల సమస్యను పట్టించుకోక పోవడంతో రోజురోజుకు ఈ దాడులు పెరుగుతున్నాయి. తాజాగా ఆదివారం బాసరకు చెందిన అల్లి అబ్దుల్లా అనే బాలుడిపై ఓ వీధి కుక్క దాడి చేసి తీవ్రగాయాలు చేసింది. అదృష్టవశాత్తు, స్థానికులు వెంటనే స్పందించిడంతో బాలుడికి ప్రమాదం తప్పింది. వెంటనే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. స్థానికంగా కుక్కల బెడద అధికమవడంతో కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చికెన్, మటన్ దుకాణాల పరిసరాల్లో కుక్కల సంచారం ఎక్కువగా ఉంటోందని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయపడుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు.

● అమ్మవారి భక్తులకు తప్పని కష్టాలు..

సరస్వతి అమ్మవారి ఆలయం పరిసరాల్లోనూ పిచ్చి కుక్కల బెడద ఎక్కువయింది. ఆలయానికి వచ్చే యాత్రికులపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచిన ఘటనలున్నాయి. గుంపులుగా తిరిగే ఈ కుక్కలను చూసి భక్తులు, ముఖ్యంగా తెల్లవారుజామున పూజలను వచ్చేవారు, తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. స్థానికులు, భక్తులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు పెరిగి పోతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికయిన సంబంధిత అధికారులు స్పందించి, తక్షణమే ఈ పిచ్చికుక్కల సమస్యను పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని బాసర గ్రామస్థులు, యాత్రికులు కోరుకుంటున్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు



ఇజ్రాయిల్‌లో బతుకమ్మ సంబురాలకు హాజరైన జిల్లా వాసులు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామ ప్రధాన వీధుల గుండా బతుకమ్మను ఊరేగించి స్థానిక బతుకమ్మ కుంటలో నిమజ్జనం చేశారు. ఎస్సై అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పెర్కిట్‌లో..

ఆర్మూర్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో బతుకమ్మ సంబు రాలు శనివారం రాత్రి వరకు కొనసాగాయి. విశాఖ కాలనీలో మహిళలు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ టవర్స్ అధ్యక్ష కార్యదర్శులు మోతే రామాగౌడ్, జగన్ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌లో..

ఆర్మూర్: ఇజ్రాయిల్‌లో ఆదివారం జిల్లావాసులు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఇజ్రాయిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు పాటలు పాడుతూ బతుకమ్మ ఆడుతూ బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు.

కార్యకర్తలకు దిశానిర్దేశం

మోస్రా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మోస్రా మండల కేంద్రంలో బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పని చేయాలని, అన్ని విధాలుగా సహకరించేందు తాము సహకరిస్తామని నాయకులు పేర్కొన్నారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తారని తెలిపారు. నాయకులు తమ అభ్యర్థిని గుర్తించి ఎన్నుకొని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ నాయకులు జుబేర్ మండల నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

సిరికొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐడీసీఎంఎస్ పర్యవేక్షకుడు అనీస్ ఆదివారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాను సారంగా ముషీర్‌నగర్, రామడుగు, కొండూర్ గ్రామాల్లో ఐడీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిని పృవేక్షకులు అనీస్ స్థానిక రైతులు, నాయకులు సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు సంతోష్ నాయక్, కుందేళ్ల శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఫోటో న్యూస్



సాటాపూర్ రైల్వే గేట్ మార్గంలో లారీలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న దృశ్యం



పొలం కోత పనుల్లో అధికంగా హార్వెస్టర్లను వినియోగిస్తున్న దృశ్యం







వరి కోతలు ప్రారంభం

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. వర్షాలు ఎప్పుడు పడతాయో తెలియక రైతులు హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్నారు. ఎడపల్లి మండలం సాటాపూర్ రైల్వే గేట్ మార్గంలో ఆదివారం ఒకే పొలంలో ఐదుకు పైగా హార్వెస్టర్లు వరి కోతల్లో నిమగ్నమయ్యాయి. కోసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు

● (ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్)

ఎన్నికల్లో సమన్వయంతో సాగుదాం

భిక్కనూరు, పాల్వంచ, దోమకొండ, (బీబీపేట), రాజంపేట అక్టోబరు 5, (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదామని, సమన్వయంతో ముందుకు సాగుదామని భిక్కనూరు మండల బీజేపీ ఇన్‌చార్జి శ్రీధర్, పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక పద్మశాలీ కళ్యాణ మండపంలో మండలంలోని అన్నిగ్రామాల బూత్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల సన్నాహక సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు బీజేపీ అభ్యర్థులు పూర్తిస్థాయిలో పోటీచేసి అధిక స్థానాలను కైవసం చేసుకునేలా సమన్వయంతో ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, పొన్నాల రంజిత్‌రెడ్డి, అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● పాల్వంచలోని రెడ్డిసంఘ భవనంలో ఆదివారం మండల బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని మండల అధ్యక్షుడు పోసు అనిల్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇంచార్జి పండ్ల ప్రవీణ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలని అన్నారు. జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు తోట బాల్‌రాజు, నర్సింహాచారి, శ్రీనివాస్‌చారీ, నరేష్, రాజేందర్, భాస్కర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికసంఖ్యలో బీజేపీ అభ్యర్థులు గెలుపొందాలని కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం బీబీపేట మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహ ఫంక్షన్ హాల్‌లో అన్ని గ్రామాల కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు.

● రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని జిల్లా కార్యదర్శి నరేందర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.


భిక్కనూరులో సభకు హాజరైన పార్టీ నాయకులు


శివాయిపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి నరేందర్‌రెడ్డి

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

సదాశివనగర్, అక్టోబరు 5, ఆంధ్రజ్యోతి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటి విజయాన్ని బీఆర్‌ఎస్ వ్యవస్థాపకులు కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని సింగిల్ విండో చైర్మన్ కమలాకర్‌రావు, మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం సదాశివనగర్ మండలకేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బీఆర్‌ఎస్ మండల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని అన్నారు. తిరిగి ప్రజలంతా కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని అన్నారు. ప్రతికార్యకర్త, నాయకుడు సైనికుడి వలె పనిచేసి గడపగడపకు వెళ్లి కేసీఆర్ చేసిన మంచి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు


విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న గ్రామస్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

సదాశివనగర్, అక్టోబరు 5, ఆంధ్రజ్యోతి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, సమాజహితం కోసం పాటుపడాలని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మార బాల్‌రెడ్డి అన్నారు. చదువులో ప్రతిభ కనబర్చిన మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పదవ తరగతిలో మార యశ్వంత్‌రెడ్డి, ఉప్పల్‌వాయి శ్రీజ, ఇంటర్‌లో నారెడ్డి శ్రీజారెడ్డి, చాకలి అర్చనకు నగదు పారితోషకంతో పాటుగా జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాలని గమ్యం చేరే వరకు విశ్రమించకూడదని అన్నారు. విద్యార్థి ఎదిగితే కుటుంబం ఎదుగుతుందని, కుటుంబం ఎదిగితే గ్రామం ముందుకు వెళ్తుందని, గ్రామం ముందుకు వెళ్తే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. మార భైరవరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ముదుప బాల్‌రెడ్డి, నారెడ్డి గోపాల్‌రెడ్డి, ప్రసాద్, రమేష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


తిరుమలాపూర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు

బాన్సువాడ రూరల్, రామారెడ్డి, అక్టోబరు 5, (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి వేడుకల్లో భాగంగా బాన్సువాడ మండలంలోని తిరుమలాపూర్, తాడ్కోల్ గ్రామాల్లో ఆదివారం విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర సహ బోధిక్ ప్రముఖ్ వెంకట శివకుమార్ మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని, హిందు సమాజాన్ని పెంపొందించి కాపాడుకునేందుకు కృషిచేయాలన్నారు. ఆయాగ్రామాల ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు సంతోష్, లక్ష్మణ్, జీవన్, రిటైర్డ్ ఎంఈవో రాంరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పాటై వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రామారెడ్డి మండలకేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా దసరా ఉత్సవం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా హిందూ వాహిని తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి ముదుప యాదిరెడ్డి, ముఖ్య అతిథిగా లింగాపురం బాలరాజు హాజరయ్యారు. రామారెడ్డి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగింది. అనంతరం జరిగిన సభలో యాదిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గత వంద సంవత్సరాల స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని వివరించారు. అలాగే దేశభక్తి, సేవా తత్పరత, సాంస్కృతిక విలువల పరిరక్షణలో సంఘం పోషిస్తున్న కీలక పాత్రను ఆయన విశదీకరించారు. దేశంలో ప్రతి పౌరుడిలో దేశాభిమానం పెంపొందించడం సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనేక మంది సంఘ్ సేవకులు, గ్రామ ప్రముఖులు, పెద్దలు, ప్రజలు, యువకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


రామారెడ్డి మండలకేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఐకమత్యంతో ముందుకు సాగాలి: ఎమ్మెల్యే

పాల్వంచ, బాన్సువాడ రూరల్, అక్టోబరు 5,(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన మున్నూరుకాపు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన మున్నూరుకాపు కుటుంబసభ్యుల ఆత్మీయ సమ్మేళనం వేడుకల్లో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘంలోని సభ్యులందరూ ఐకమత్యంతో కలిసిమెలిసి సంఘం అభివృద్ధికి ముందుకు సాగాలన్నారు. ఒకే కుటుంబంలా కలిసి మెలిసి ఉండాలని ఐకమత్యంతో ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తోట శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బాల్‌రాజు, బాల్‌లింగం, నర్సింలు, డాక్టర్ నర్సింలు, సాయిలు, బాల్‌రాజు, రాములు, కాశీనాథం పాల్గొన్నారు.

● బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులబొగడ శ్రీనివాస్‌రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదివారం హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు మురళిధర్‌గౌడ్, పైడి ఎల్లారెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, గంగారెడ్డి, జిల్లా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్నూరుకాపు ప్రతినిధులు


కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సదాశివనగర్, అక్టోబరు 5, (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బల్వంత్‌రావును ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదివారం పరామర్శించారు. బల్వంత్‌రావు తల్లి శ్యామలాబాయి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఆయన బాధిత వ్యక్తి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, మండల నాయకులు ఉన్నారు.

లింగంపేటలో అలరించిన సంగీత బృందం

లింగంపేట, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలోని ఖద్రీ ఫామ్ హౌస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కవ్వాలీ బృందం అందరిని అలరించింది. హైకోర్టు లాయర్ మోహీన్ అహ్మద్ ఖద్రీ గ్యార్వీ షరీఫ్ సందర్భంగా ఈ కవ్వాలీని ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ హాజరై తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొన్నారు. ఖవాలిని తిలకించడానికి మండల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, నాయకులు అబ్దుల్ వాహబ్, ఇబ్రహీం, షాదుల్లా, రవిగౌడ్, ప్రసాద్‌గౌడ్, రఫీక్, అశోక్, మోహీద్‌లతో పాటు నాయకులు, తదితరులు ఉన్నారు.


పాటలు పాడుతున్న బృందం


హాజరైన ఎమ్మెల్యే మదన్ మోహన్

సీఎం పర్యటించినా.. నయాపైస అందని సాయం

(3వ పేజీ తరువాయి)

సహాయం అందిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు ఎలాంటి ఆర్థిక సహాయం అందించలేదని ఆయన విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరదల వల్ల పంట నష్టపోయిన నివేదికలను తెప్పించుకొని పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు తక్షణమే అందించాలని, ఇళ్లు కూలిపోయిన వారికి ఒక లక్ష పది వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి నూతన ఇళ్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, జనార్దన్ గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దిన్, టీఎస్‌పీఎస్‌సీ బోర్డు మాజీ సభ్యురాలు సుమిత్రా ఆనంద్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సిద్దయ్య, మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీకి స్థానం లేదు

గాంధారి: తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని ఆ పార్టీలోని నాయకులు రాజీనామాలు చేసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని, రాష్ట్ర అభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఆదివారం గాంధారిలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ పేదల పార్టీ కాదని అది ధనవంతుల పార్టీ అని అన్నారు. కేవలం దేశం కోసం అనుకుంటూ గొప్పలు చెప్పడం బీజేపీకి అలవాటైందన్నారు. తెలంగాణకు కేంద్రంలో ఉన్న బీజేపీ ఎందుకు నిధులు ఇవ్వడం లేదని, బీజేపీ ఎమ్మెల్యేలు కేంద్రం నుంచి నిధులు ఎందుకు తేవడం లేదని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఎందుకు మెడికల్ కళాశాలలు, నవోదయ విశ్వవిద్యాలయాలు ఎందుకు ఇవ్వడం లేదని, కేంద్రం నిధులు ఇవ్వకుండా ఎగ్గొడితే రాష్ట్ర బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో తెలంగాణలో వరి, గోధుమ పంటలకు ఒకే ధర ఉండేదని కానీ ఇప్పుడు వరి కంటే గోధుమలకు రూ.200పైగా ఎక్కువ ధర ఉందని అన్నారు. పక్క రాష్ట్రంలో ఎంపీలు అధికంగా ఉండటంతోనే ప్రత్యేక ప్యాకేజీలు వస్తున్నాయన్నారు. తెలంగాణకు ప్రధాని రైల్వే నిధులు ఇవ్వకుండా చిన్నచూపు చూస్తున్నారని, సీఎం రేవంత్ ఒక్కసారైనా మోదీని నిధులు అడిగారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోని రాగానే భూముల ధరలు పడిపోయాయని, మద్యం ధరలు పెరిగిపోయాయని ఎద్దేవా చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమని.. పురుషులకు డబుల్ ధరలు వసూళ్లు చేస్తున్నారని ఇది ఎంత వరకు సమంజసమని అన్నారు. ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న బతుకమ్మ చీరలు ఏమయ్యాయో చెప్పాలని, ఇస్తామన్న రైతు బంధు రూ.15వేలు ఏమైందని, రాష్ట్రంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఇస్తామన్నా నష్టపరిహారం ఎటు పోయిందన్నారు. కామారెడ్డిలో పర్యటించిన సీఎం ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వకపోవడం ఆయన పతనానికి నిదర్శనమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఓట్లు అడగడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులను ఇచ్చిన హామీలపై నిలదీయాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధిక సీట్లు గెలుచుకుని జిల్లా పరిషత్‌లను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

అపూర్వ సమ్మేళనం

భిక్కనూరు, అక్టోబరు 5, (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1982-83లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం మండలంలోని మాసుపల్లి ఆలయం వద్ద ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు ఒకరినొకరు క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గత అనుభవాలను పంచుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ప్రతిఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటామని తెలిపారు. తమ బ్యాచ్‌లో ఎవరికైనా ఆపద వచ్చినా, శుభకార్యాలు జరిగినా పాలపంచుకుంటామని చెప్పారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


దోమకొండలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


మాసుపల్లిలో పూర్వవిద్యార్థుల సమ్మేళన దృశ్యం

దోమకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట గ్రామంలో జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చదివిన 2007-2008 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భైరయ్య, సిద్దరాములు, రాజేందర్, నళినిదేవి, ధర్మసింగ్, విష్ణువర్ధన్, రఘువీర్, క్రిష్ణమోహన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.30,111 పలికిన అమ్మవారి లడ్డూ

గాంధారి, అక్టోబరు 5, (ఆంధ్రజ్యోతి): గాంధారిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగాయి. చివరిరోజు ఆదివారం అమ్మవారి చేతిలో ఉంచిన లడ్డూను మండప నిర్వాహకులు వేలం వేశారు. ఈ వేలంలో లడ్డూను మూడవసారి మండలకేంద్రానికి చెందిన రామ్‌దళ్ సభ్యులు రూ.30,111లకు కైవసం చేసుకున్నారు.


లడ్డూ కైవసం చేసుకున్న రామ్‌దళ్ సభ్యులు


జాతీయ మహాసభలకు వెళ్తున్న తపస్ ప్రతినిధులు

జాతీయ మహాసభలకు తరలిన నాయకులు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 5, ఆంధ్రజ్యోతి: రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ జామ్‌డోలిలోని కేశవ విద్యా పీఠంలో తపస్ జాతీయమహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగనున్న ఈ సభలు, జాతీయ విద్యా సదస్సుకు కామారెడ్డి జిల్లా తపస్ అధ్యక్షుడు పులగం రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి భునేకర్ సంతోష్, రాష్ట్ర అకాడమిక్ కోకన్వీనర్ భాస్కరాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు వేదప్రకాష్, రచ్చ శివకాంత్ ఆదివారం ఉదయం తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. జాతీయ నూతన విద్యావిధానం- 2020, సీపీఎస్ రద్దు, ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎంఎల్‌సీ ఓటు హక్కు, టెట్ మినహాయింపు, జీవో- 317, విద్యారంగంలో నూతన ఆవిష్కరణలు, విద్యారంగ సమస్యలపై ఈ సభల్లో పలు తీర్మాణాలను చేయనున్నట్లు వివరించారు.

కాంగ్రెస్ నూతన కమిటీల ఏర్పాటు

రామారెడ్డి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ అధ్యక్షులు సర్దార్ నాయక్ ఆదేశానుసారం రామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిప్పరి గణేష్ ఆధ్వర్యంలో రామారెడ్డి మండల యూత్, టౌన్ యూత్ కమిటీలు ఆదివారం ఏర్పాటు చేశారు. మండల యూత్ ఉపాధ్యక్షుడిగా ఎం.డీ అద్నన్, సెక్రటరీగా గాండ్ల రంజిత్, రామారెడ్డి టౌన్ యూత్ కమిటీ అధ్యక్షుడిగా కుశనోళ్ల ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా తూర్పు ప్రశాంత్, దర్ని రమేష్, జనరల్ సెక్రటరీగా ధర్మారం సుమన్, జాయింట్ సెక్రటరీగా ఎస్‌డీ హైదర్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీలో నిలిచే అభ్యర్థులను గెలిపించేలా కృషి చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికై ఐక్యంగా ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న మంచి పనులను ఇంటింటికీ తిరుగుతూ వివరిస్తామని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన రామారెడ్డి మండల, పట్టణ యూత్ కమిటీ సభ్యులు

వ్యవసాయ విస్తరణ అధికారికి సన్మానం

రామారెడ్డి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం అన్నారం క్లస్టర్ మద్దికుంట, అన్నారం, గొడుగు మర్రితాండ గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారి జి. శ్రీనివాస్‌కు పదోన్నతి లభించింది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను రైతులకు చేరవేసి రైతుల మెప్పు పొంది తాడ్వాయి మండలంలో తొమ్మిది సంవత్సరాలు, రామారెడ్డి మండలం అన్నారం క్లస్టర్‌లో ఎనిమిది సంవత్సరాలు రైతులకు సేవచేశారు. తాజాగా పదోన్నతిపై వ్యవసాయ అధికారిగా (టెక్నికల్) నిజామాబాద్ కలెక్టరేట్‌కి వెళ్తున్న ఆయన్ను రాజకీయ నాయకులు, రైతులు సన్మానించారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

కామారెడ్డి రూరల్, అక్టోబరు 05 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ శివారులో వెలసిన ఉగ్రవాయి మైసమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పర్వదినం కావడంతో ఉదయం నుంచే భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. కుంకు మార్చనలు, హారతి, ఒడిబియ్యం సమర్పణ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో సంతాన నాగదేవతతో పాటు పలు దేవతా మూర్తులను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి తరలి వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు అన్నీ రకాల ఏర్పాట్లు చేశారు.

లొట్టివాగు ఉగ్రరూపం.. రాకపోకలు బంద్

పాల్వంచ, అక్టోబరు 5, (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి మండలంలోని వాడి- ఫరిద్‌పేట్ గ్రామాల మధ్యగల లొట్టి వాగు ఉగ్రరూపం దాల్చింది. వాగుపై నుండి నీరు ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు ఈ రోడ్డు గుండా రాకపోకలను నిలిపివేశారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపుల కంచె ఏర్పాటుచేశారు. ఈ రోడ్డు గుండా రాకపోకలు నిలిచిపోవడంతో పాల్వంచ మర్రి నుండి బీబీపేటకు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


వాడి- ఫరిద్‌పేట్ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న లొట్టివాగు

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- భద్రకాళీ
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి	ఓజీ
వెంకటేశ్వర	కాంతార

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230